TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని వెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతాయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 1 సంచిక :141 prajadivvs57@gmail. com శనివారం 4 ఏప్రిల్ 2026 ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ పేజీలు : 4 వెల : 3/-

# రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు

## - సభల్లో సిఎం రేవంత్ సందేశం విడుదల



: ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా రాష్ట్రమంతటా గ్రామ సభలు జరుగుతు న్నాయి .ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సందేశం అందించారు. గ్రామ సభల్లో అధికారులు ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపిస్తారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల మూడునెలలు పూర్తయ్యింది. ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ, గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ... సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా మన ప్రభుత్వం పని చేస్తోంది. మేం పాలకులం కాదు... సేవకులం అన్న భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నాం. ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుంటున్నాం. ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ప్రజా పాలనకు మీ ఆమోదం, మద్దతు ప్రకటించారు. మీరు ఇచ్చిన ఈ ఫలితాలు మా బాధ్యతను మరింత పెంచాయి. ప్రభుత్వ పథకాలు అంటే కాగితాలపై కాదు... ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తేవాలన్నది మా సంకల్పం. ఆ ఉద్దేశంతోనే 'ప్రజాపాలన– ప్రగతిప్రణాళిక' పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించాం. మార్చి 6 నుండి 99 రోజుల పాటు, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా సాగాలి. ఊరు వాడ సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి అధికారి పని చేయాలి. వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి. మహాలక్ష్మి... ఉచిత బస్సుసౌకర్యం, 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాలు మిగతా2లో...

# కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

- కెసిఆర్ ఇష్టానుసారం కాళేశ్వరం నిర్మాణం
- ఎటిఎంలా ప్రాజెక్ట్ను వాడుకున్న కెసిఆర్
- ఐదు మండలాలపై ఆనాడు నోరు మెదపని కెసిఆర్
- అవినీతిపై కెసిఆర్‌ను జైలుకు పంపుతామన్న కాంగ్రెస్
- రాజ్యసభలో సురేశ్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ కిషన్ రెడ్డి



: రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగాయన్నారు. కాళేశ్వరం వల్ల ఉగయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు. కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్ సొంత డబ్బుతో మిగతా2లో...




## యుద్ధాన్ని ఆపేది లేదు.. అమెరికాకు అవమానం తప్పదు.. తేల్చిచెప్పిన ఇరాన్

అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఇరాన్ భారీ హెచ్చరిక జారీ చేసింది. ఎట్టి పరిస్థితుల్లో యుద్ధాన్ని ఆపేది లేదని స్పష్టం చేసింది. అమెరికా బెదిరింపులకు లొంగబోమని తెలిపింది. యుద్ధం ముగింపుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రకరకాల ప్రకటనలు చేస్తున్న వేళ ఇరాన్ చేసిన ప్రకటన సంచలనం సృష్టిస్తోంది. ఈ మేరకు ఇండియాలోని ఇరాన్ ఎంబసీ తన సోషల్

మిగతా2లో...

# కాంగ్రెస్ మోసాలను సోషల్ మీడియాతో ఎండగట్టాలి

## - పార్టీ శ్రేణులకు హరీష్ రావు పిలుపు



: కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను సోషల్ మీడియా వేదికగా ఎండగట్టాలి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గం బొల్లారంకు చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎండీ ఆరిఫ్ తో పాటు మరో 25 మంది సభ్యులు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాలరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరార. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..ప్రస్తుత రాజకీయాల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలంటే సోషల్ మీడియాలో అత్యంత చురుకుగా మిగతా2లో...

# అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

## - ప్రధాని మోడీని కలిసి లోకేశ్ కృతజ్ఞతలు



అమరావతికి చట్టబద్ధత బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లుకు లోక్‌సభలో ఏకగ్రీవ ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. గురువారం బిల్లును రాజ్యసభలో ప్రవేశ పెట్టారు.

మిగతా2లో...

# చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

- అయిన వారి కోసం..కార్మికుల పొట్ట కొడతారా?
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కవిత



: కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల పొట్టకొడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. చేనేత కార్మికులకు ఇచ్చిన విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాల్సిన వారికి మేలు చేసేందుకే కార్మికులకు అన్యాయం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఏటా సుమారు రూ.105 కోట్ల యూనిఫాంల ఆర్డర్ ఇచ్చేవారని.. ఇప్పుడు దాని రద్దుతో వేలాది మందికి ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతల ఉపాధి సంక్షోభంలో పడిందని కవిత ధ్వజమెత్తారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలపై తీవ్ర ప్రభావం

మిగతా2లో...

# భూభారతి పోర్టల్ ఆవిష్కరణ

## - అక్రమాలకు ఇక చెక్ : పొంగులేటి



**తొలి అక్షరం/రంగారెడ్డి,ఏప్రిల్ 02:** రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసి చూపిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. భూ క్రయవిక్రయాల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రూపొందించిన 'సమీకృత భూభారతి' పోర్టల్‌ను రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం విఠాయిపల్లిలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే ప్రజా ప్రభుత్వమిది అని అన్నారు. ఈ నెలాఖరులో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జరుగుతుందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరంతరం కొనసాగుతుందని చెప్పారు.



## ఫ్యూచర్ సిటీలో పనులు పరిశీలించిన సిఎం రేవంత్

: కేరళలో ఎన్నికల ప్రచారం ముగించుకుని వచ్చిన సిఎం రేవంత్ రెడ్డి, ఫ్యూచర్ సిటీపై దృష్టి సారించారు. గరువారం అధికారులతో కలసి ఆయన ఫ్యూచర్ సిటీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఫ్యూచర్ సిటీలో ఎఫ్‌సిడిఎ కార్యాలయం, స్కిల్స్ యూనివర్సిటీ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. పలు సూచనలు చేశారు. సిఎం వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. కె. రామకృష్ణారావు తదితరులు ఉన్నారు.

# కమిషన్ల కోసమే టెస్కోకు ఆర్డర్లు రద్దు

## - ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరుపై కెటిఆర్ విమర్శలు



: ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు సంస్థలకు వత్తాసు పలకడమేనా ప్రజా పాలనా..అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. టెస్కోకు విద్యాశాఖ షాక్ అని ఓ ప్రముఖ దినపత్రికలో వచ్చిన కథనాన్ని ఎక్స్‌లో కేటీఆర్ ట్యాగ్ చేస్తూ రేవంత్ సర్కార్ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ టెస్కోకు ఆర్డర్లు రద్దు చేసి ప్రైవేట్ కంపెనీలకు ఇచ్చి చేనేత సంఘాల కార్మికుల పొట్ట కొడుతుందని.. ఇది ప్రజా ప్రభుత్వమా.. లేక 'ప్రైవేట్' లిమిటెడ్ మిగతా2లో...

# అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**• వైసీపీ వాకౌట్ • చర్చలో 11 పార్టీలు..18 మంది సభ్యులు**

: ఆంధ్రప్రదేశ్

రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. దీంతో ఈ బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభల ఆమోదముద్ర ప్రక్రియ ముగిసింది. ఈ బిల్లును కేంద్రం రాష్ట్రపతికి పంప నుంది. ఈ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సం తకం చేసిన తరువాత గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుం ది. గురువారం రాజ్యసభలో కేంద్ర హోం శాఖ సహా య మంత్రి నిత్యానంద రారు బిల్లును ప్రవే శపెట్ట నున్నారు.రాజ్యసభ చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ బిల్లుపై



చర్చకు అనుమతి ఇచ్చారు. అమ రావతి చట్టబద్ధత బిల్లుపై జరిగిన చర్చలో 11 పార్టీలు నుంచి 18 మంది సభ్యులు పాల్గొన్నారు. అయితే వైసీపీ రాజ్యసభలో కూడా బిల్లును వ్యతిరేకించి వాకౌట్ చేసింది.

---

# కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

(మొదటి పేజీ తరువాయి)

కట్టారా అంటూ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు తీసుకొని కాళేశ్వరం నిర్మించారని కేంద్ర మంత్రి తెలిపారు. భద్రాచలంలో ఉన్న గ్రామాలు ఏపీ పునర్విభజన చట్టంలో చేర్చారని... అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. ఎన్నికల ముందు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరిపి కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మాజీ సీఎంపై ఎందుకు విచారణ జరపలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిలదీశారు. ఈ క్రమంలో కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు.కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారని కిషన్‌రెడ్డి అన్నారు.

---

# కాంగ్రెస్ మోసాలను సోషల్ మీడియాతో ఎండగట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడంలో సోషల్ మీడియానే నేడు కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా రాష్ట్ర యువతను తీవ్రంగా దగా చేసింది. ఎన్నికలకు ముందు అమలుకాని హామీలిచ్చి గద్దెనెక్కి, అధికారంలోకి వచ్చాక నిలువునా ముంచిందని ఆగ్ర హం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ లేదు, కొత్తగా ఉద్యోగాల కల్పన లేదు. వారు చెప్పిన రెండు లక్షల ఉద్యోగాల హామీ పూర్తిగా బోగస్ అని తేలిపోయింది. యువతతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచించిందని మండిపడ్డారు. అవ్వాతాతల కు పెన్షన్లు పెంచకుండా, కోటి మంది మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వకుండా, రైతన్నలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా ప్రతి వర్గాన్ని దారుణంగా మోసం చేసింది. ఈ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మీలాంటి యువత ముందుకొచ్చి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలి. కాంగ్రెస్ చేస్తున్న ప్రతి మోసాన్ని సోషల్ మీడియా వేదికగా సామాన్య ప్రజలందరికీ తెలిసేలా చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు పార్టీ ఇన్‌ఛార్జి ఆదర్శ్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

---

# ఏప్రిల్ 24 నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

**అధికారికంగా ప్రభుత్వం ఉత్తర్వులు**

: ఈ నెలాఖరు

నుంచి స్కూళ్లకు సెలవులు ప్రారంభం కానున్నాయి. నెలాఖరులోగా సిలబస్ పూర్తి చేసి, పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. ఎండలు దంచికొడుతున్న క్రమంలో తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరటనిచ్చే వార్త చెప్పింది. వేసవి సెలవుల షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేసింది. వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని స్కూళ్లకు సెలవులను అధికారులు ముందుగానే ప్రకటించారు. విద్యాశాఖ తాజా ప్రకటన ప్రకారం.. తెలంగాణలోని స్కూళ్లకు ఈ ఏడాది ఏకంగా 48 రోజుల పాటు వేసవి సెలవులు ఉండనున్నాయి. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు ఈ సెలవులు అమల్లో ఉంటాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు ఈ నిబంధన వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం జూన్ 12న తిరిగి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. సెలవులు ప్రారంభమయ్యే లోపు సిలబస్ పూర్తి అయ్యేలా చూడాలని ప్రభుత్వం పాఠశాలల యాజమాన్యాలకు సూచించింది. అవసరమైతే విద్యాపరంగా ఎలాంటి



అంతరాయం లేకుండా వారానికి ఒకసారి అదనపు తరగతులు నిర్వహించవచ్చని తెలిపింది.

---

# సమస్యలు తెలుసుకోవడమే గ్రామసభల లక్ష్యం

**2047 విజన్‌తో రాష్ట్రాన్ని ముందుకెళుతున్న సిఎం**

**తుమ్మలూరు గ్రామసభలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**

: ప్రజా పాలన –

ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామసభలు విజయవంతంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు రంగారెడ్డి జిల్లా మాహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ 2047 విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. మనమందరం ఈ ప్రగతి పాలనలో భాగస్వాములం కావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే




గ్రామసభ ముఖ్య ఉద్దేశం అని సి.ఎస్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతు ందని తెలిపారు. ప్రభుత్వ పథకాలతో పాటు, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్ని హాస్టళ్లు, స్కూళ్లలో డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం, వసతులు కల్పిస్తున్నట్లు వివరిం చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందిం చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని ఆయన అన్నారు. మహిళా సాధి కారత కొరకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్కూల్ యూ నిఫాం కుట్టే పనులు, ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని సి.ఎస్ అన్నారు. కళ్యాణ్ లక్ష్మి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు.

---

# యుద్ధాన్ని ఆపేది లేదు.. అమెరికాకు అవమానం తప్పదు.. తేల్చిచెప్పిన ఇరాన్

(మొదటి పేజీ తరువాయి)

మీడియా వేదికగా ఈ ప్రకటన చేసింది."మేం అమెరికా బాంబుల కారణంగా రాతియుగంలోకి వెళ్లడం లేదు. మాకు 7,000 ఏళ్ల నాగరిక చరిత్ర ఉంది. చరిత్రకు ఈ విషయం తెలుసు. అమాయకులైన పిల్లల్ని చంపి, అమానవీయ నేరాలు చేస్తున్న మీరు రాతియుగాన్ని ఆధునిక ప్రపంచంలోకి తెచ్చారు అనేది స్పష్టం" అని తన ట్వీట్‌లో పేర్కొంది. ఇరాన్‌తో యుద్ధంపై బుధవా రం రాత్రి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. తాము ఇరాన్‌పై చేస్తున్న యుద్ధం కారణంగా ఆ దేశం రాతియుగంలోకి వెళ్తుందన్నారు. ఇరాన్ సైన్యం, నేవీ పూర్తిగా బలహీనపడిపోయాయని చెప్పారు. యుద్ధాన్ని రెండు, మూడు వారాల్లో ముగిస్తామ న్నారు. అయితే, ఇరాన్ మిలిటరీ మాత్రం ట్రంప్ ప్రకటనకు ధీటుగా స్పందించింది. అమెరికాకు తీవ్ర అవమానం జరిగే వరకు యుద్ధాన్ని వదలేది లేదని, అమెరికా పశ్చాత్తాప పడి, లొంగిపోయే వరకు తమ దాడులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఇరాన్ మిలిటరీకి నష్టం జరిగిందన్న అమెరికా ఆరోపణల్ని కూడా ఆ దేశం ఖండించింది. అమెరికా తమను తక్కువగా అంచనా వేసిందని అభిప్రాయపడింది. ఇరాన్ సైనిక ప్రతినిధి ఒకరు ఈ వ్యాఖ్యలు చేశారు. తమ దేశం దగ్గరున్న సైనిక శక్తి, మిస్సైళ్ల తయారీ గురించి అమెరికా ఇంటెలిజెన్స్‌కు సరిగ్గా తెలియదన్నారు. లాంగ్ రేంజ్ అటాక్ మిస్సైల్స్ డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, స్పెషలైజ్డ్ ఎక్విప్‌మెంట్ వంటివి తమ దేశం దగ్గరున్నాయని ఇరాన్ ప్రతినిధి మీడియాతో తెలిపారు.

# అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

(మొదటి పేజీ తరువాయి)

హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో అమరావతికి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ ఆమోదించిన నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఐదుకోట్ల మంది ప్రజల ఆకాంక్ష అయిన అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పూర్తి మెజార్టీతో లోక్‌సభలో ఆమోదం లభించడానికి కృషి చేసిన ప్రధాని మోదీకి లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం ఉదయం పార్లమెంట్ హాలులో మంత్రి లోకేశ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు నిలిపి అమరావతికి చట్టబద్ధత కల్పించిన ప్రధాని మోదీకి ఆంధప్రదేశ్ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు.లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన వెంటనే మంత్రి నారా లోకేశ్ ఆగమేఘాలపై ఢిల్లీ వెళ్లారు. కూటమి పార్టీ ఎంపీలను అభినందించారు. ఉదయం ప్రధానమంత్రి మోదీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి చూపిన నిబద్ధతను మంత్రి లోకేశ్ ప్రశంసించారు.

# రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు

(మొదటి పేజీ తరువాయి)

అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలి. తెలంగాణ రైజింగ్ 2047' విజన్ తో ఆర్థికంగానే కాక, అన్నీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో నెంబర్ వన్ గా నిలపాలన్నది మన సంకల్పం. ఈ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. క్యూర్,ప్యూర్, రేర్‌గా రాష్ట్రాన్ని వర్గీకరించుకున్నాం. వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా మనం ఎదగాలి. 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదు.. ఒక దీక్ష. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై... దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలి. ఇదే నా కల. ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలి. మీ అందరి సహకారాన్ని కోరుకుంటూ మీ రేవంత్ రెడ్డి అన్న సందేశాన్ని విడుదల చేశారు.

# చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

(మొదటి పేజీ తరువాయి)


చూపనుందని.. కార్మికులు వీధిన పడే దుస్థితి వచ్చిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ శాఖలకు చెందిన దుప్పట్లు, దుస్తులకు సంబంధించి రూ.200 కోట్ల ఆర్డర్లను కూడా తెలంగాణ చేనేతలకు ఇవ్వలేదని ఆరోపణలు గుప్పించారు. ÷స్కోకు ఆర్డర్లు ఇవ్వకుండా సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు కవిత. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు కల్వకుంట్ల కవిత.

# కమీషన్ల కోసమే టెస్కోకు ఆర్డర్లు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

కంపెనీయా..? అని మండిపడ్డారు.రూ. 105 కోట్ల విలువ గల స్కూల్ యూనిఫామ్ ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. సంక్షేమ శాఖ నుండి టెస్కోకు దక్కాల్సిన రూ. 200 కోట్ల దుస్తులు, దుప్పట్ల ఆర్డర్ ఇంకా ఇవ్వకపోవడం వెనుక కారణం ఏంటి..? అని అడిగారు.కాంగ్రెస్ దండుపాళ్యం ముఠా కమీషన్లు దండుకోవాలనే యావలో ప్రైవేట్ వ్యక్తులకు ఆర్డర్లు ఇస్తున్నదని ధ్వజమెత్తారు. నేతన్నల ఉసురు పోసుకుంటున్న కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

# రాష్ట్రప్రజలకు కెసిఆర్ హనుమత్ జయంతి శుభాకాక్షలు



రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ సీతారామచంద్రమూర్తి భక్తుడుగా, బలం, జ్ఞానం, వాక్చాతుర్యం అన్నీకలిసి, అరుదైన వ్యక్తిత్వం కలిగిన జ్ఞానిగా, హిందూ పురాణాలు హనుమంతుడిని కీర్తిస్తాయని కేసీఆర్ తెలిపారు. సంత్ తులసీదాస్ తన రామచరిత మానస్‌లో చెప్పినట్టు అంజనీ సుతుడు జ్ఞానినాం అగ్రగణ్యం., అంటే జ్ఞానుల్లో అత్యున్నతుడు..అని కేసీఆర్ పేర్కొన్నారు. వాల్మీకి రామాయణంలో శ్రీరాముడు అన్నట్టు 'న వాక్యదోషం నచ అపశబ్దం'..అంటే., ఎటువంటి దోషాలు లేని భాషతో, ఉచ్చారణతో, వ్యాకరణం మీద పట్టుతో వాక్ శుద్ధితో ప్రసంగించే గొప్ప వక్త హనుమంతుడు అని కేసీఆర్ కొనియాడారు. ధర్మరక్షణ కోసం, తాను నమ్మిన శ్రీ రామునికి తన శక్తినంతా ధారపోసి, ఎటువంటి ప్రతి ఫలాపేక్ష లేకుండా, ప్రజా సంక్షేమం కోసం నాయకత్వాన్ని తన భుజాలమీద మోసిన బలశాలి, వినయానికి ,విజయానికి మార్గదర్శి, మృదుస్వభావి శ్రీ ఆంజనేయ స్వామి అని కేసీఆర్ కొనియాడారు. జ్ఞానం వాక్చాతుర్యం బలం భక్తి వినయం అన్నీ కలెగలిసిన సంపూర్ణ వ్యక్తిత్వం హనుమంతుడికే సాధ్యం అన్నారు. వారి ఆచరణ ఎల్లకాలం ఆదర్శనీయమని, నేటి యువతరానికి ఆచరణీయమని కేసీఆర్ తెలిపారు. ఆదర్శవంతమైన ఆలోచనలతో, దూరదృష్టితో, తమ జీవితాలను తీర్చిదిద్దుకునే శక్తిని హనుమంతుడు రాష్ట్ర ప్రజలకు అందించాలని, ప్రగతి తిరిగి పుంజుకుని రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా చూడాలని కేసీఆర్ ప్రార్థించారు.

# మన ఇసుక వాహనం తోనే ఇసుక రవాణా

**- మన ఇసుక వాహనం, వెబ్సైట్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు**

**- అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట**

**ముస్తాబాద్/ ఏప్రిల్ 3(ప్రజా దివాస్):** పారదర్శకంగా ఇసుక సరఫరా ఇసుక తరలింపులో పారదర్శకత కోసం మన ఇసుక వాహనం ఆన్లైన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు లోకి తీసుకువచ్చింది. నిర్మాణాదారులు మొబైల్ అప్లికేషన్, వెబ్సైట్ ద్వారా తమకు నచ్చిన ఇసుక రీచ్ నుంచి ఇసుక బుకింగ్ చేసుకునే అవకాశం ఉంది. ఇసుక పక్కదారి పట్టకుండా .. నిర్ణీత పత్రాలు జత చేసే వారికి అందుబాటులో ఉంటుంది. ఆన్లైన్ విధానం ద్వారా సులభంగా బుకింగ్ చేసుకునే వీలు ఉంది.సె ంటర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన మన ఇసుక వాహనం అప్లికేషన్, ఆన్లైన్ వెబ్ సైట్ లో నిర్మాణదారులు ఇసుక ఎలా బుక్ చేసుకోవాలి? డబ్బు ఎలా చెల్లించాలి? ఇసుక ఏ రీచ్ నుంచి పొందాలి? ఆన్లైన్ లో పూర్తి



వివరాలతో వీడియో సందేశం అందుబాటులో ఉంది. జిల్లా కమిటీ ఆమోదించిన ఇసుక రీచ్ ల నుంచే ఇసుక తరలించ నున్నారు. ఇసుక తరలింపులో నేరుగా కూపన్లు ఇచ్చే విధానం నుంచి ఆన్లైన్ ద్వారా పొందే విధానం అమలు చేయనున్నారు.ఇసుక కేటాయింపు, తరలిం పు పూర్తి పారదర్శకంగా ఉంటుంది. మధ్యవర్తుల అవసరం లేకుండా ప్రజలు నేరుగా ఆన్లైన్ ద్వారా ఇసుకను బుక్ చేసుకునే సౌకర్యం కల్పించబడింది. దీనివల్ల అక్రమ రవాణా నివారించబడుతుంది. అందుబాటులో టోల్ ఫ్రీ నంబర్, మెయిల్ ఐడీమన ఇసుక వాహనం విషయమై సమాచారం, వివరాలు తెలుసుకునేందుకు టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో పెట్టారు. 040-23120421/8333923732 ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంటాయి. అలాగే మెయిల్ ఐడీ helpdesk.tsmiv@cgg.gov.in, ఉన్నాయి.మన ఇసుక వాహనం ద్వారా ఇసుక బుక్ చేసుకునేటప్పుడు అప్లోడ్ చేయవలసిన ధృవీకరణ పత్రాలు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి: అధికారి జారీ చేసిన ధ్రువపత్రం.ఇతర ఇంటి నిర్మాణానికి: సంబంధిత పంచాయతీ కార్యదర్శి, అధికారి జారీ చేసిన ఇంటి నిర్మాణ అనుమతి పత్రం.ప్రభుత్వ పనులకు సంబంధిత కార్య నిర్వహణ ఇంజనీర్ జారీ చేసిన అనుమతి పత్రం (అప్లోడ్ చేసే డాక్యుమెంట్స్ 200 కేబీ లోపల ఉండాలి. పీడీఎఫ్, జే పేజీ విధానంలో ఉండాలి)

# తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలు



**ముస్తాబాద్/ ఏప్రిల్ 3 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణ త్యాగం చేసిన తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 99 వ జయంతి మహోత్సవాన్ని శ్రీ కృష్ణ యాదవ సంఘం మండల అధ్యక్షులు రాగం నాగరాజు చెవుల మల్లేష్ కోడె శ్రీనివాస్ ఆధ్వర్యంలో యాదవ కురుమ కుల బాంధవులు అదేవిధంగా ముస్తాబాద్ అన్ని గ్రామాల కుల బాంధవుల సమక్షంలో దొడ్డి కొమురయ్య జయంతి పునస్కరించుకుని కొమురయ్య విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళి అర్పించారు ముస్తాబాద్ గ్రామ సర్పంచి మట్ట వెంకటేశ్వర్ రెడ్డి ఉప సర్పంచ్ విజయ్ సెస్ డైరెక్టర్ సందు పట్ల అంజి రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎల్ల బాల్ రెడ్డి భాను అరుట్ల మహేష్ బాలయ్య టీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎద్దండి నరసింహారెడ్డి మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు సర్వర్ పాషా మాజీ ఎంపీటీసీ గుండెల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గజ్జల రాజు వివిధ గ్రామాల పెద్దలు గీస బిక్షపతి శీలం స్వామి వివిధ కుల బాంధవులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది

# ప్రజలను అప్రమత్తం చేయాలి...

**రాత్రి సహారా పెంచి ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేసి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి**

**డిఎఫ్ఓ బాలమణి**



**వీర్నపల్లి ఏప్రిల్ 3 (ప్రజా దివాస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా అటవీ అధికారి (డిఎఫ్ఓ)బాలామణి వీర్నపల్లి అటవీ ప్రాంతంలో క్షేత్ర పర్యటన నిర్వహించి, ఇటీవల గుర్తించిన వన్యప్రాణుల కదలికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలని, పాదముద్రలు, విసర్జన లు, సంచార ఆనవాళ్లు వంటి అంశాలను నిరంతరం పరిశీలిస్తూ సమాచారం పై అధికారులకు వెంటనే అందించాలని ఆదేశించారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అంచు గ్రామాల ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఒంటరిగా అటవీ ప్రాంతంలోకి వెళ్లరాదని, పశువులను అడవి అంచులకు మేతకు తీసుకెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పిల్లలు ,మహిళలు ఒంటరి గా అడవి దారుల్లో సంచరించకుండా చూడాలని, వన్యప్రాణి కనిపించిన వెంటనే అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు.అటవీ సిబ్బందికి ముందస్తు చర్యలుగా గస్తీ బృందాలను బలోపేతం చేయడం, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం, అవసరమైతే రాత్రి పహారా పెంచాలని సూచించారు.ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వన్యప్రాణులను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడరాదని, గుంపులుగా మాత్రమే ప్రయాణించాలని, అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే అటవీ శాఖకు సమాచారం అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఫారెస్ట్ రేంజ్ అధికారి కల్పనా దేవి గొల్లపల్లి, వీర్నపల్లి, అల్మాస్పూర్ అటవీ సెక్షన్ అధికారులు రంజిత్ కుమార్,సకారం, పద్మలత, బీట్ అధికారులు కిరణ్, రజిత, సతీష్,శ్రీకాంత్ అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలే లక్ష్యం



**ముస్తాబాద్/ ఏప్రిల్ 3 ప్రజా దివాస్** ఎస్ ఈ బి . బిక్షపతి ఆదేశాల మేరకు గంభీరావుపేట మండలంలోని ముస్తాబాద్ సెక్షన్ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ ఉద్యోగులు, ఓ ఙ ఎం సిబ్బందితో వేసవి కార్యాచరణ, వ్యవసాయ సర్వీసుల మంజూరు, విద్యుత్ భద్రతపై సిరిసిల్ల డివిజన్ ఇంజనీర్ అంజయ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం డివిజన్ ఇంజనీర్ అంజయ్య మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన,నిరంతర విద్యుత్ సేవలు అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో లోడ్ పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.ట్రాన్స్ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడం, ప్రమాదభరితంగా ఉన్న లైన్లను గుర్తించి మరమ్మతులు చేయడం, వంగిన విద్యుత్ స్థంభాలను తక్షణమే మార్చడం వంటి చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో పనులు నిర్వహించే ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని, హెల్మెట్, హ్యాండ్ గ్లౌజ్, ఎర్త్ రాడ్ వంటి భద్రతా పరికరాలు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు చేయరాదని స్పష్టం చేశారు.అదేవిధంగా గ్రామీణ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ( ఏ జి ఎల్ ) పెండింగ్‌లో ఉన్న సేవలను త్వరితగతిన విడుదల చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గంభీరావుపేట ఏ.డి.ఈ శ్రీనివాస్ , ఏ.ఈ విష్ణు తేజ , ఓ ఙ ఎం సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భక్తులకు చల్లని త్రాగునీరు అందించేందుకు భీమేశ్వర ఆలయంలో చలివేంద్రం ప్రారంభం



**వేములవాడ/ప్రజాదివాస్ ఏప్రిల్ 03** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులకు చల్లని త్రాగునీరు అందించే ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన జల ప్రసాద కేంద్రం ప్లాంట్ ద్వారా కూలర్లకు నల్లల ద్వారా త్రాగునీరు అందిస్తూ భక్తులకు సౌకర్యం కల్పిస్తున్నారు.అలాగే సేవా వాలంటీర్ల సహకారంతో అవసరమైన ప్రాంతాల్లో కూల్ బబుల్స్ ఏర్పాటు చేసి భక్తులకు సులభంగా నీరు అందే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నటరాజ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి గారు ప్రారంభించారు.వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాల్లోని ఇతర ప్రాంతాల్లో కూడా అవసరాన్ని బట్టి మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఈవో తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు, అలాగే విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి త్రాగునీరు అందుబాటులో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, సేవా వాలంటీర్లు పాల్గొన్నారు

# మర్రిమడ్లలో విద్యుత్ ఉపకేంద్రానికి భూమిపూజ

**ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**కొనరావుపేట మండలం/ప్రజాదివాస్ ఏప్రిల్ 03** సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం (సబ్ స్టేషన్) పనులకు రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో ఉన్న లో-వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ఈ సబ్ స్టేషన్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. రైతులకు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రతి ఇల్లు ఒక పాఠశాల కావాలి

**- సిరిసిల్లలో ఘనంగా స్వేరో జ్ఞాన ఖడ్గధారణ**

**- డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్వేరోస్ ఫౌండర్ చైర్మెన్.**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఏప్రిల్ 3 ప్రజా దివాస్** ప్రతి పేద వారి ఇల్లు ఒక పాఠశాలగా మారినపుడే,సమాజంలో మార్పు సాధ్యమని,జ్ఞాన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని స్వేరో ఫౌండర్ చైర్మెన్ డా.ఆర్ఎస్ ప్రవీణ కుమార్ తెలిపారు.ఈ రోజు సిరిసిల్ల పట్టణంలోని సాయిప్రియ ఫంక్షన్ హాల్ లో జరిగిన స్వేరో ఖడగ ధారణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,ప్రతి ఇంట్లో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కావాలని,తమ పిల్లలచేత ప్రతి రోజు పుస్తకాలు చదివించాలని పిలుపునిచ్చారు. సమాజంలో మన చుట్టూ ఉండే ప్రకృతి జ్ఞానం కూడా నేర్పాలని కోరారు.వ్యవసాయం,ప్రాజెక్టులు,అడవులు,మ్యూజియం,జే పార్క్ లు చూపించి వాటి గురించి సహజసిద్ధమైన జ్ఞానాన్ని పిల్లలకు అందించాలన్నారు. జ్ఞాన ఖడ్గధారణలో భాగంగా చిన్న పిల్లల కాళ్లు కడిగి,తలకు కిరీటం పెట్టి,చేతిలో ఖడ్గం, పుస్తకం ఇచ్చి వారిని జ్ఞాన వీరులుగా ప్రకటించారు.

స్వేరో జ్ఞాన ధీక్షలో భాగంగా ప్రతి ఏటా మార్చి 15 న్ది ఏప్రిల్ 14 వరకు జరిగే ఈ కార్యక్రమంలో జ్ఞాన ఖడ్గ ధారణ ఒక భాగమన్నారు. మహాత్మ జ్యోతిభా పూలే,బాబా సాహెబ్ అంబేద్కర్ మహనీయుల కలలు సాకారం కావాలంటే జ్ఞాన సమాజ నిర్మాణం కావాలన్నారు. జ్ఞాన సమాజం నిర్మాణం కావాలంటే ప్రతి ఇంట్లో పూజ గదితో పాటు పుస్తకాల గది ఉండాలన్నారు.ప్రతి ఇంట్లో



తల్లిదండ్రులు పిల్లలను రోజూ చదివించాలని సూచించారు. అంతేకాకుండా ప్రతి శనివారం సాయంత్రం 6 గం.లకు జరిగే ప్రేరణ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ప్రేరణలో భాగంగా మనకు ప్రేరణగా నిలిచిన గొప్ప వ్యక్తులను గుర్తుకు తెచ్చుకోవాలని,గత వారంలో మీరు చేసిన పనులను,నేర్చుకున్న విషయాలను గుర్తుకు తెచ్చుకోవాలని తోటి వారితో పంచుకోవాలన్నారు. స్వేరో నాయకులు మారుపాక రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మారెపెల్లి మనోజ్,దారమల్ల ప్రకాష్,ప్రసాద్,జిల్లా నాయకులు మహేందర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం 2005 పైన అవగాహన కార్యక్రమం




**కామారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 03ప్రజా దివాస్** శ్రీ సాయి విజ్ఞాన్ హై స్కూల్ పద్మాజివాడి గ్రామం లో సమాచార హక్కు చట్టం 2005 పైన అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ సలీం కామారెడ్డి జిల్లా సదాశినగర్ మండలంలోని పద్మాజివాడి గ్రామంలో గల శ్రీ సాయి విజ్ఞాన్ హై స్కూల్ లో సమాచార హక్కు చట్టం 2005 మరియు ఇతర చట్టాల పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ఎం ఏ సలీం పాల్గొని ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ మరియు సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ కామారెడ్డి జిల్లా సలహాదారులు భాగ్యలక్ష్మి పాఠశాల అధ్యాపక బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ అమలు రామగుండం సిపి



**క్యాతనపల్లి ఏప్రిల్ 3 ప్రజా దివాస్** రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచి ర్యాల జోన్ పరిధిలోని క్యాతన్‌పల్లి మున్సి పాలిటీ పరిధిలో శనివారం ఉదయం 06:00 గంటల నుండి చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ అమల్లో ఉంటుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ ఆంక్షల కాలంలో నలుగురికి మించి గుంపులుగా చేరడం పూర్తిగా నిషేధమని తెలిపారు ప్రశాంతమైన వాతావరణాన్ని ఉద్రిక్తం చేసే రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కవ్వింపు చర్యలు, గొడవలకు దారితీసే ప్రవర్తన ఏదైనా చోటుచేసుకున్నట్లయితే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, అటవీ అధికారులు, కేంద్ర బలగాలు, హోమ్‌గార్డులు మరియు ఎస్పీఓలకు ఈ నిషేధాలు వర్తించవని స్పష్టం చేశాం చట్టపరమైన అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తా రోకో లు, ఊరేగింపులు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని, ఎవ్వరు కూడా కర్రలు, కత్తులు, తుపాకులు లేదా ఎలాంటి మారణాయుధాలతో సంచరించడం పూర్తిగా నిషేధమని సీపీ తెలిపారు. మైకులు, లౌడ్‌స్పీకర్ల ద్వారా పాటలు ప్రసారం చేయడం, సభలు నిర్వహించడం, ప్రజలను ఒక వర్గం మీద మరొక వర్గం మీద రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేయడం నిషేధమని తెలిపారు. 163 బి.ఎన్.ఎస్.ఎస్. సెక్షన్ అమలు సమయంలో చట్టబద్ధమైన అధికారాన్ని ధిక్కరించే విధమైన ప్రకటనలు, ప్లకార్డులు, గుర్తులు ప్రదర్శించడం కూడా చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించిన పక్షంలో, చట్ట ప్రకారం వారి మీద చర్యలు తీసుకోబడతాయి అని సీపీ తెలిపారు


## జిల్లాలో జనగణన పనులు సమగ్రంగా చేపట్టాలి -- కలెక్టర్ అంకిత్



**ఏప్రిల్ 3 భద్రాద్రి కొత్తగూడెం ప్రజా దివాస్:** జిల్లాలో జాతీయ జనగణన కార్యక్రమాన్ని సమగ్రంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. జనగణన ప్రక్రియలో ప్రతి ఇంటిని కవర్ చేస్తూ, ఎలాంటి లోపాలు లేకుండా ఖచ్చితమైన డేటా సేకరణ జరగాలని ఆయన అన్నారు .జాతీయ జనగణన కార్యక్రమం భాగంగా ఏప్రిల్ 1 నుండి 3 వరకు జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో ఫీల్డ్ ట్రైనర్స్‌కు మూడు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించబడగా, ఫీల్డ్ స్థాయిలో పని చేసే సిబ్బందికి అవసరమైన అన్ని అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనర్స్‌గా ఎన్. శివరామకృష్ణ, డాక్టర్ పి. సుస్మిత రజిని పాల్గొని, మొత్తం 34 మంది ఫీల్డ్ ట్రైనీస్‌కు జనగణన నిర్వహణ విధానం, హౌస్ సెన్సెస్, డేటా సేకరణలో పాటించాల్సిన జాగ్రత్తలు, డిజిటల్ పద్ధతుల వినియోగం తదితర అంశాలపై విపులంగా శిక్షణ అందించారు. శిక్షణలో భాగంగా మూడవ రోజు పాలకోయ తండా ప్రాంతంలో ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. ఫీల్డ్ ట్రైనీస్‌ను అవుట్ ఫీల్డ్‌కు తీసుకెళ్లి, ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరించే విధానాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మొదటి ఇంటిలో హౌస్ సెన్సెస్ కార్యక్రమాన్ని కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ సమక్షంలో నిర్వహించారు. ఈ డెమో ద్వారా ఫీల్డ్ ట్రైనీస్‌కు ప్రత్యక్ష అనుభవం లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణనలో సేకరించే సమాచారం ప్రభుత్వ విధానాల రూపకల్పనకు ఎంతో కీలకమని అన్నారు . అందువల్ల ప్రతి వివరాన్ని శ్రద్ధగా నమోదు చేయాలని, ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారికి అవసరమైన సమాచారం అందిస్తూ డేటా సేకరణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెన్సెస్ జిల్లా అధికార సిబ్బంది, సి.పి.ఓ. సంజీవరావు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణా కార్యక్రమం కొనసాగింది.

# పెద్దపెల్లి జిల్లా టి ఆర్ పి కార్యాలయం ఘనంగా ప్రారంభం

### - ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్
### - పార్టీలో చేరికలు సంస్థగత విస్తరణకు మరో మైలురాయి




**పెద్దపెల్లి, ఏప్రిల్ 03 (ప్రజా దివాస్)** తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీ ఆర్ పి ) పెద్దపెల్లి జిల్లా కార్యాలయం శుక్రవారం రోజున ఘనంగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పలు పార్టీ నాయకులు టి ఆర్ పి లో చేరడంతో పాటు సంస్థగత విస్తరణకు మరో మైలురాయి నిర్మించబడింది. పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, పార్టీ రాష్ట్ర సెక్రటరీ అఖిల్ పాషా , సోషల్ మీడియా సౌత్ తెలంగాణ కన్వీనర్ మార్త శ్రీనివాస్ , నూతన జిల్లా అధ్యక్షులు మెరుగు చందర్ యాదవ్ తో కలిసి కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నూతన జిల్లా అధ్యక్షులు మెరుగు చందర్ యాదవ్ అధ్యక్షతనా పెద్దపెల్లి జిల్లాలోని పలు పార్టీ నాయకులు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో అధికారికంగా చేరారు. ఈ చేరికల సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్ చేరిన నాయకులందరికీ కండువా కప్పి హృదయపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్ మాట్లాడుతూ,ఎవరెంతో వారికంత అనే సిద్ధాంతంతో మా పార్టీ ముందుకు సాగుతోంది. బీసీలపై జరుగుతున్న అన్యాయాలు, అవకతవకాలు చూసి తట్టుకోలేక ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాయకత్వంలో ఈ పార్టీ ఆవిర్భవించింది. మైనారిటీలకు నిజమైన రాజకీయ న్యాయం, సామాజిక న్యాయం కేవలం తెలంగాణ రాజ్యాధికార పార్టీ ద్వారా మాత్రమే సాధ్యం. మైనారిటీ జనాభా దమాషా ప్రకారం బడ్జెట్ వాటా కేటాయించే ఏకైక పార్టీ మన టి ఆర్ పి మాత్రమే. పెద్దపెల్లి జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి నూతన జిల్లా అధ్యక్షులు మెరుగు చందర్ యాదవ్ నాయకత్వంలో తీవ్రంగా కృషి చేయాలి. టి ఆర్ పి పార్టీ లో చేరిన నాయకులందరూ పార్టీ బలాన్ని మరింత పెంచుతారని నేను విశ్వసిస్తున్నాను అని అన్నారు . గ్రామస్థాయి నుంచి మండలం, జిల్లా వరకు సంస్థాగత నిర్మాణం బలంగా ఉండాలి. బీసీ యువత, మహిళలు, వ్యవసాయకులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలి. రాబోయే రోజుల్లో లిపెద్దపెల్లి జిల్లా టి ఆర్ పి కి బలమైన కేంద్రంగా మారాలి అని సూచనలు ఇచ్చారు. అనంతరం పార్టీ రాష్ట్ర సెక్రటరీ అఖిల్ పాషా మాట్లాడుతూ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ బీసీలకు జరుగుతున్న అన్యాయం చూసి తట్టుకోలేక తీన్మార్ మల్లన్న నేతృత్వంలో పుట్టింది. ఎవరెంతో వారికంత అనే సిద్ధాంతంతో పార్టీ ముందుకు నడుస్తుంది. బీసీలకు నిజమైన రాజ్యాధికారం అందించే ఏకైక పార్టీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ మాత్రమే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ పెద్దపెల్లి జిల్లా నాయకులు,టి ఆర్ పి కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యాలయ ప్రారంభోత్సవం, పార్టీ చేరికల కార్యక్రమం ఉత్సాహవంతంగా, సంఘీభావంతో ముగిసింది.

# అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పట్టించుకోరా?

### చిరు వ్యాపారుల బాధలు తీర్చరా
### కాంట్రాక్టర్ల జేబులు నింపే పనులు మానుకోవాలి



**ఏప్రిల్ 3 భద్రాద్రి కొత్తగూడెం ప్రజా దివాస్:** మణుగూరు మండలంలో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. నిర్మాణం ప్రారంభమై సంవత్సరాలు గడుస్తున్న... నేటికీ అసంపూర్తిగానే ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అందుబాటులోకి రాకపోవడంతో పట్టణం లో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్కులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు తూ తూ... మంత్రంగా పనులు అసంపూర్తిగా నిర్వహించి పక్కకు ఉంటున్నారు తప్ప... పూర్తి చేయడం లేదు. దీని వల్ల ఆ నిర్మాణాల వల్ల ప్రజలకు దక్కాల్సిన ప్రయోజనం లభించడం లేదు. ఆ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కే పూర్తి చేయకుండానే మరో చోట సైడ్ డ్రైన్, సీ సీ రోడ్లు పనులు అప్పగించడం ఎటువంటి అభివృద్ధి మంత్ర మో అధికారులే తేల్చాలనీ డిమాండ్ చేస్తున్నాం. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్ల పైన ఎండలో ఎన్నో కష్టాలకోర్చి వ్యాపారాలు నిర్వహిస్తున్న చిరు వ్యాపారులకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఇప్పటికైనా అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నాం. మున్సిపాలిటీలో తలపెట్టిన ప్రభుత్వ అభివృద్ధి పనులు పూర్తికాకుండా ఆ పనులు నిర్వహించిన వారికి మరోచోట వర్కులు ఇవ్వకూడదు. మణుగూరులో ఇంటిగ్రేటెడ్ నిర్మాణం చేపట్టిన ఓ కాంట్రాక్టర్ ఆ పనులు అక్కడ నిలిపివేసి బినామీల ద్వారా మరో కాంటాక్ట్ పనులు నిర్వహించడం ఈ తతంగం అంతా మున్సిపాలిటీ అధికారులకు తెలిసిన చూసి చూడనట్టు వదిలేయడం సరైనది కాదు. పనులు అసంపూర్తిగా ఉంచడంతో మార్కెట్ యార్డ్ క్రమక్రమంగా శిథిలావస్థకు చేరుకుంటుంది. కాంట్రాక్టర్లు సిమెంట్ స్టాక్ పాయింట్ కి, కొబ్బరి చిప్పలు ఎండబోసుకునేందుకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతోంది. ఇప్పటికైన మున్సిపాలిటీ అధికారులు అసంపూర్తిగా నిలిచిపోయిన మార్కెట్ ను అందుబాటులోకి తీసుకురావాలి. వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టిసారించి ఆ పనులు పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రజాధనం దుర్వినియోగం అవుతున్న క్రమంలో చర్యలు తీసుకొని పక్షంలో మున్సిపాలిటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలుపుతున్నాం. రేణుక అక్షరం మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ.

# శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయంలో సిపి అంబర్ కిషోర్ ఝా ప్రత్యేక పూజలు

### -సి పి దంపతులను ఘనంగా సన్మానించిన ఎస్ఆర్ఎం కన్స్ట్రక్షన్ అధినేత ఆలయ పోషకులు మాచిడి మహేందర్ గౌడ్



**గోదావరిఖని, ఏప్రిల్ 03ప్రజా దివాస్**రామగుండంలోని స్వయంభు శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి అన్నపూర్ణాదేవి దేవాలయం భక్తిశ్రద్ధలతో కళకళలాడింది. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా దంపతులు ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు, పవిత్ర అభిషేకం నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ పుణ్య సందర్భంలో ఆలయ మహారాజ పోషకులు, ఎస్ఆర్ఎం కన్స్ట్రక్షన్స్ అధినేత మాచీడి మహేందర్ గౌడ్ సిపి దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించి, స్వామివారి పవిత్ర చిత్రపటాన్ని అందజేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ ప్రధాన అర్చకులు గొల్లపల్లి విజయ చార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు వైభవంగా సాగగా, కుసుమ కుమారి, మాంగీలాల్, ఏబీసీ రెడ్డి తమ సేవలను అందించారు. అలాగే ఆలయ నిర్వాహకులు కొంక సాయికుమార్, నరేష్, కొంక ప్రదీప్, ప్రణయ్ తదితరులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తుల అధిక సమాగమంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోగా, ఈ ప్రత్యేక పూజలు భక్తుల హృదయాలలో విశేష ఆనందాన్ని నింపాయి.